ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
బుధవారం 28 ఆగస్టు 2024

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 25.0
తణుకు : 34.0 - 26.0

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

» కలెక్టర్ నాగరాణి



భీమవరం టౌన్, ఆగస్టు 27 : ప్రజా సమస్యల పరిష్కారంతో ప్రజలకు చేరువ కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో మీ కోసం పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. అర్జీదారులకు మనం చేయగలిగే స్థితిలో ఉన్నాం. ఇది ఎల్లప్పుడూ గుర్తించుకోవాలి. ఎంతో మందికి రాని అవకాశం మనకు ప్రభుత్వ ఉద్యోగం ద్వారా కలిగింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల సంక్షేమానికి పాటుపడాలి. ప్రతి ఫిర్యాదును ఒకటికి, రెండుసార్లు చదివి అర్థం చేసుకోవాలి. ఏదైనా అదనపు సమాచారం అవసరమైతే అర్జీదారులను ఫోన్‌లో సంప్రదించి మాట్లాడాలి' అని అన్నారు. జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరాంప్రసాద్, డీఎస్‌వో ఎన్.సరోజ, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, డ్వామా పీడీ ప్రభాకర్‌రావు, డీఎంహెచ్‌వో డి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

20 మంది పనిచేస్తే.. వంద మందికి కూలి!

» ఒక పని ఫొటో.. పది పనులకు అప్‌లోడ్
» కంప్యూటర్ ఆపరేటర్‌కూ మస్తర్లు
» మూడేళ్లపాటు కూలీగా క్యాన్సర్ బాధితురాలు.. పైసా చెల్లించని వైనం
» ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ

యలమంచిలి, ఆగస్టు 27 : 'ఇరవై మంది పనిచేస్తే.. వంద మందికి మస్తర్లు వేస్తున్నాడు. పనిచేస్తున్న ఒకే ఫొటోను 10 వర్క్‌లకు అప్‌లోడ్ చేస్తున్నాడు. కొందరు పనికి వెళ్లకపోయినా ఉపాధి హామీ పథకం కూలీలుగా చూపించి మస్తర్లు వేశాడు. ఇలా ఒక కుటుంబానికి చెందిన తండ్రి, కుమారుడు ఎప్పుడూ పనికి వెళ్లకపోయినా గత ఏడాది వారికి రూ.60 వేలు చెల్లించారు. ఎంపీడీవో కార్యాలయంలోని ఎన్ఆర్‌జీఎస్ విభాగం మహిళా కంప్యూటర్ ఆపరేటర్‌కు ఉపాధి కూలీగా మస్తర్లు వేశారు' అంటూ యలమంచిలిలో ఎన్ఆర్‌జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మాణిక్యాలరావుపై గ్రామస్థులు ఆరోపణలు గుప్పించారు. వీరు ఇచ్చిన ఫిర్యాదుపై గ్రామీణాభివృద్ధి శాఖ భీమవరం క్లస్టర్ ఏపీడీ పి.సుజాత మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన అవకతవకలపై 120 పేజీలతో కూడిన ఆధారాలను ఫిర్యాదుదారులు అధికారికి అందించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ 'ఒకే ఫొటోను ఇన్ని వర్క్‌లకు అప్‌లోడ్ చేయడం నిబంధనలను అతిక్రమించడమే. ఇలా ఎందుకు చేశారు. తరచుగా మేన్యువల్‌గా ఎందుకు మస్తర్లు వేస్తున్నారు' అని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. దీనికి ఆయన నుంచి సమాధానం రాలేదు. ఉపాధి కూలీల పేర్లను చదువుతూ ఫిర్యాదులు, అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. జరుగుతున్న అక్రమాలపై పలువురు గ్రామస్తులు వివరించారు. నిబంధనలు అతిక్రమించి, అవినీతికి పాల్పడ్డ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని గ్రామస్తులు ఏపీడీని కోరారు. విచారణలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో సమావేశం రసాభాసగా మారింది. పోలీసులు సిబ్బంది, అధికారులు సర్దిచెప్పడంతో విచారణ కొనసాగింది. బర్రే భూలక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ 'నేను క్యాన్సర్‌తో బాధపడుతున్నా. మూడేళ్లుగా ఉపాధి కూలీగా పనిచేస్తున్నా ఇంత వరకూ పైసా కూడా చెల్లించలేదు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగితే అదిగో ఇస్తాను.. ఇదిగో ఇస్తానని చెబుతున్నాడు. నాకు న్యాయం చేయాలి' అని ఆమె కోరింది. ఆమె మాటలు విన్న ప్రజలకు కళ్లు చెమర్చాయి. ఒక క్యాన్సర్ పేషెంట్‌ను కూడా మోసం చేస్తారా ? అని మండిపడ్డారు. విచారణపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఏపీడీ సుజాత తెలిపారు.



యలమంచిలిలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి ఆరోపణలపై గ్రామ సభలో విచారణ

రోడ్డున పడేశారు



తాడేపల్లిగూడెం-వెంకట్రామన్నగూడెం రోడ్డు నిర్మాణం.. కాంట్రాక్టర్ నుంచి వైసీపీ నేత భారీగా కమీషన్లు

» బిల్లులు ఇప్పించడంలో విఫలం.. కాంట్రాక్టరు అప్పులపాలు.. ఆస్తులు అమ్ముకుంటున్న దుస్థితి..

» అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలనూ వదల్లేదు..
» సొమ్ములు ఇచ్చి విధుల్లో చేరిన సిబ్బందికి ఉద్వాసన
» బాధితులు లబోదిబో

తెలుగుదేశం ప్రభుత్వం 2019లో తాడేపల్లిగూడెం-నల్లజర్ల మధ్య నాలుగు లైన్‌ల రహదారి నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. తాడేపల్లిగూడెం నుంచి వెంకట్రామన్నగూడెం వరకు రహదారి అభివృద్ధికి రూ.26 కోట్లు మంజూరుచేసింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పనులకు టెండర్లు పిలిచారు. స్థానిక వైసీపీ నేత భారీ మొత్తంలో కమీషన్ డిమాండ్ చేస్తుండడంతో రెండేళ్లపాటు ఒక్కరు కూడా టెండర్ వేసేందుకు సాహసం చేయలేదు. విశాఖలో స్థిరపడ్డ ఓ కాంట్రాక్టర్ ముందుకొచ్చారు. బిల్లులు వచ్చేస్తాయంటూ అధికారులు భరోసా ఇచ్చారు. పనులు మొదలు పెట్టి రహదారి పూర్తిచేశారు. వైసీపీ నేత అనుకున్నట్టే కమీషన్ తీసుకున్నప్పటికి.. కాంట్రాక్టర్‌కు మాత్రం ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. సొమ్ములు తీసుకున్న నేత ఈ విషయంలో ఏ విధమైన ప్రయత్నం చేయలేదు. కాంట్రాక్టర్ ఇప్పుడు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. బ్యాంకు రుణం తీర్చకపోతే డిఫాల్టర్ అయ్యే ప్రమాదం ఉంది. దీంతో ఉన్న ఆస్తులు అమ్ముకుని అప్పులు తీర్చేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఇదిలా ఉంటే.. అంచనా వేసినట్టు తాడేపల్లిగూడెం నుంచి వెంకట్రామన్నగూడెం వరకు నాలుగు లైన్‌ల రహదారి వెళ్లలేదు. పూర్తి కావాలంటే మరో రూ.15 కోట్లు అవసరం. ఆ నిధులను వైసీపీ ప్రభుత్వం కేటాయించింది. పనులు చేపట్టాలని సూచించింది. కొత్త కాంట్రాక్టర్ టెండర్ వేశారు. పనులు చేపట్టలేదు. ఎన్నికల ముందు వైసీపీ నేత కబురుపెట్టారు. కమీషన్‌ల కోసమే అని భావించిన కాంట్రాక్టర్ ముఖం చాటేశారు. తాడేపల్లిగూడెంలో మరో ఇద్దరు కాంట్రాక్టర్‌లు పనులు చేయలేదు. టెండర్‌లు వేసి చేతులెత్తేశారు. జిల్లాలో అత్యంత ప్రభావిత రహదారులు అంటూ వైసీపీ హడావుడి చేసి పనులు పూర్తి చేసి బిల్లులు విస్మరించింది. కాంట్రాక్టర్లు చుక్కలు చూస్తున్నారు.

ఎన్నికల ముందు వారికే సొమ్ములు

ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరుచేసింది. నాటి వైసీపీ ప్రజా ప్రతినిధులు సిఫారసుల మేరకు బిల్లులు విడుదల చేసింది. కమీషన్లు వస్తాయని భావించిన బిల్లులకు మాత్రమే నేతలు ఆమోదముద్ర వేశారు. ప్రభుత్వం వద్ద లాబీయింగ్ చేసి బిల్లులు ఇప్పించేసుకున్నారు. మున్సిపాలిటీల్లో ఇలా కోట్ల రూపాయల బిల్లులు మంజూరయ్యాయి. ఇప్పటికీ కొందరికి బిల్లులు రాలేదు. వారంతా ఇప్పుడు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసిన తర్వాతే టెండర్లు వేయాలని చూస్తున్నారు. మున్సిపాలిటీల్లో ఇటువంటి ధోరణి కనిపిస్తోంది. ఆర్అండ్‌బీ రహదారుల విషయంలోనూ కాంట్రాక్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు శంకుస్థాపనలు చేసినా సరే పనులు చేపట్టలేదు. తాజాగా కూటమి ఎమ్మెల్యేల భరోసాతో కొన్నిచోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. బిల్లులు ఇస్తుందన్న నమ్మకంతో పనులు చేపడుతున్నారు. అదే తాడేపల్లిగూడెం నుంచి వెంకట్రామన్నగూడెం వెళ్లే రహదారి మధ్యలో ఆగిపోయింది. అది పూర్తి కావాలంటే కొత్త కాంట్రాక్టర్ పనులు చేయాలి. గతంలో పని పూర్తి చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లు ఇవ్వకపోవడంతో కొత్త కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడం లేదు. తెలివిగా ఎన్నికల ముందు వైసీపీ నేత వద్దకు వెళ్లలేదు. లేదంటే కమీషన్ గుంజేవారు. ఇప్పుడు కొందరు కాంట్రాక్టర్‌లు పనులు ప్రారంభిస్తే వైసీపీ నేత రంకెలు వేస్తున్నారు. కాంట్రాక్టర్‌లపై దుమ్మెత్తి పోస్తున్నారు. అంతేతప్ప తమ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్‌లు అప్పులు పాలయారన్న విషయాన్ని విస్మరిస్తున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగాల్లోనూ అదే దందా

మున్సిపాలిటీలు, ఇతర సంస్థల్లో ఉద్యోగాలు ఇస్తామంటూ వైసీపీ నేతలు సొమ్ములు వసూలు చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రక్షాళన చేపట్టింది. అవసరం లేకున్నా సరే ఉద్యోగాలు కల్పించారని గుర్తించింది. వారిని విధుల నుంచి తొలగించింది. ఇలా అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు కోల్పోయిన వారంతా వీధిన పడ్డారు. కూటమి నేతలను సంప్రదించారు. ఒక్కో వ్యక్తి వద్ద రూ.3 లక్షలు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చినట్టు గుర్తించారు. ఉద్యోగం కోల్పోయిన వారికి సొమ్ములు తీసుకున్న నేతల నుంచి తిరిగి ఇప్పించారు. ఇలా వైసీపీ ముఖ్య నాయకులకు సొమ్ములు ఇచ్చిన ద్వితీయ పార్టీ శ్రేణులు బాధితులకు తిరిగి సొమ్ములు చెల్లించాల్సి వస్తోంది. ముఖ్య నేతలు మాత్రం పెదవి విప్పడం లేదు. మధ్యలో ఉండి సొమ్ములు ఇప్పించిన చోటా నాయకులు ఇప్పుడు బలైపోతున్నారు. నేతలు మాత్రం గుంభనంగా ఉంటున్నారు. తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

పైగా తమ అవినీతి దందాను కప్పి పుచ్చడానికి కూటమి నాయకులకు వివరాలు ఇవ్వకూడదంటూ ఒత్తిడి తీసుకువస్తున్నారు. మొత్తంపై లబ్ధి పొందడం నేతల వంతయ్యింది. బలైన వారు కాంట్రాక్టర్‌లు. చోటా మోటా నాయకులు. వారంతా ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారు.



96 పనులు..
రూ.1109.80 కోట్లు

జిల్లాలో ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి అంచనాల రూపకల్పన

నియోజకవర్గాలు	పనులు	రూ.కోట్లలో
భీమవరం	14	152.65
పాలకొల్లు	16	96.40
ఆచంట	34	718.75
తణుకు	16	48.00
ఉండి	1	12.00
తాడేపల్లిగూడెం	12	40.00
నరసాపురం	3	42.00
మొత్తం	96	1109.80

భీమవరం టౌన్, ఆగస్టు 27 : వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం, నిధులు మంజూరు చేయకపోవడంతో అవి పూర్తిగా దెబ్బతిని ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద పెద్ద గోతులతో ప్రయాణం నరకంగా మారింది. గోతులను సైతం పూడ్చేందుకు ప్రయత్నాలు చేయని పరిస్థితి. ప్రజల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో అప్పట్లో తూతూమంత్రంగా గోతులు పూడ్చి చేతులు దులుపుకున్నారు. కొన్ని రోడ్లకు నిధులు మంజూరుచేసినా బిల్లులు రావనే భయంతో చాలా మంది కాంట్రాక్టర్లు పనులు చేపట్టలేదు. కూటమి అధికారంలో రాగానే ప్రజా ప్రతినిధులు ముందుగా రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టారు. దీంతో స్థానిక ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి అవసరమైన రోడ్లకు ప్రతిపాదనలు తయారు చేయించారు. వాటిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల నుంచి మొత్తం 96 పనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. వీటి నిర్మాణానికి రూ.1109.80 కోట్లు అవసరమని అధికారులు తేల్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా చోట్ల రోడ్లు మళ్లీ గోతులు పడ్డాయి. దీనిపై ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వర్షాకాలం ఉన్నందున రోడ్లను అభివృద్ధి చేయకపోతే మళ్లీ పాత రోజులు పునరావృతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

నాన్ లే అవుట్‌లపై కన్నెర్ర

» జిల్లాలో 108 గుర్తింపు



భీమవరం టౌన్, ఆగస్టు 27: జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో వున్న అనధికార లే-అవుట్‌లపై ప్రభుత్వం దృష్టి సారించింది. వీటిపై కఠినచర్యలు తీసుకోవాలని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగుతున్నారు. అనధికారిక లే-అవుట్‌ల్లో స్థలాలను కొనుగోలు చేయవద్దని ఇప్పటికే మునిసిపాల్టీల వారీగా టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రకటనలు జారీచేసి ఆయా స్థలాల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. అనధికారి లే-అవుట్‌ల సంఖ్య పదుల్లో ఉన్నాయి. వీటికి సంబంధించిన యజమానులు అనుమతి కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరుతున్నారు. అది కూడా నిబంధనలకు అనుగుణంగా 30 అడుగుల రహదారి ఉండాలని, మునిసిపాల్టీకి పది శాతం కామన్‌సైట్ అప్పగించాలని, అప్పుడే లే-అవుట్‌లకు అనుమతి ఇస్తామని చెబుతున్నారు. ఇప్పటికే అనధికారిక లే-అవుట్‌లకు సంబంధించి టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రకటనలు ఇస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు గుర్తించిన అనధికారిక లే అవుట్లు.. భీమవరంలో 16, తణుకు 11, పాలకొల్లు 2, తాడేపల్లిగూడెం 7, నరసాపురం 41, ఆకివీడు 31 వెరసి 108 ఉన్నట్లు చెబుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లే-అవుట్ రెగ్యులరైజేషన్ అమలుకు అంతా ఎదురుచూస్తున్నారు.

చనిపోయిన వ్యక్తి ఎవరు ?

» ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో మగ్గుతున్న మృతదేహం
» ఎమ్మెల్సీ కేసుల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం

ఏలూరు క్రైం, ఆగస్టు 27 : ఏలూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీలో శవాలు కుళ్లిపోతున్నాయి! మెడికో లీగల్ కేసు(ఎమ్మెల్సీ)ల నమోదు విషయంలో మృతదేహాల సమాచారాన్ని పోలీసులకు ఇవ్వడంలో ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణం. అత్యవసర విభాగంలో వైద్యసేవలు అందించేటప్పుడే ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఎక్కడ ప్రమాదం జరిగింది, ఎవరు తీసుకొచ్చారు వంటి వివరాలతోపాటు, ఆ వ్యక్తి మరణిస్తే ఆ సమాచారాన్ని జాప్యం లేకుండా ఔట్ పోస్ట్ పోలీసులు తెలియజేయాలి. వీరు సంబంధిత స్టేషన్ల సమాచారం అందిస్తారు. వారు బంధువుల సహకారంతో శవ పంచనామా చేసి మృతదేహాలను అప్పగిస్తారు. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. కాని ఆస్పత్రిలో అధికారుల పర్యవేక్షణ లోపించడంతో వైద్య సేవలు ఇష్టానుసారం కొనసాగుతున్నాయి. ఎమ్మెల్సీ నమోదు, ఆ వివరాలు పోలీసులకు అందించడంలో వైఫల్యం కారణంగా ఒక్కోసారి మార్చురీలో శవాలు కుళ్లిపోతున్నాయి. ఈ నెల 22న రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై అపస్మారక స్థితిలో ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరిన మరుసటి రోజే మరణించడంతో ఆ మృతదేహాన్ని గుర్తు తెలియని మృతదేహంగా రికార్డులో నమోదు చేసి మార్చురీకి తరలించారు. ఇప్పటి వరకు ఆ సమాచారం ఔట్‌పోస్ట్ పోలీసులకు ఇవ్వలేదు. ఇంతకీ ఆ చనిపోయిన వ్యక్తి ఎవరు ? అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంతగా తల్లడిల్లుతూ ఉంటారు ? అనే కనీస స్పృహ కూడా ఆస్పత్రి సిబ్బందికి లేకపోయింది. అధికారులు పట్టించుకోకుంటే ఈ ఆసుపత్రి తీరు మారదు.



గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్డు, గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటుచేశారు. ఒక్కొక్క కేంద్రంలో పది నుంచి 14 మంది ఉద్యోగులను నియమించారు. వీరిలో కొన్ని శాఖల వారికి పూర్తి స్థాయిలో పనులు లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. వీటిని అధ్యయనం చేసిన ప్రభుత్వం ప్రక్షాళన చేసి క్లస్టర్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని యోచిస్తోంది. దీనిపై బుధవారం జరిగే కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనుంది.

సచివాలయ ప్రక్షాళన !

» క్లస్టర్ విధానం తెచ్చేందుకు ప్రయత్నాలు
» కొన్ని శాఖల ఉద్యోగులను మాతృ శాఖకు అప్పగించే యోచన.. నేటి కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం

నరసాపురం, ఆగస్టు 27 : రాష్ట్ర విభజన తర్వాత అప్పటి ప్రభుత్వం పాలనను ప్రజలకు మరింత దగ్గర చేయాలని సంకల్పించింది. దీనికి అనుగుణంగా ప్రతి ఐదు వేల మందికి ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అయితే ఇది అప్పట్లో కార్యరూపం దాల్చలేదు. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం క్లస్టర్ స్థానాల్లో గ్రామ, వార్డు సచివాలయాలను తీసుకొచ్చింది. ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించామన్న ప్రచారం తప్ప ఈ విధానంలో అనుకున్న స్థాయిలో ఫలితాలు రాలేదు. పేరుకు పది నుంచి 14 మంది ఉద్యోగులు ఉన్నా.. వారిలో కొందరికి మాత్రమే ఎక్కువ పని భారం ఉండేది, మరికొందరికి అసలు పనే ఉండటం లేదు. ఈ వ్యవస్థలో గ్రామ, వార్డు కేంద్రాల్లో వేర్వేరు స్థాయి ఉద్యోగులు పని చేస్తున్నారు. గ్రామ స్థాయిలో అయితే పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి, పర్యావరణ అసిస్టెంట్, పశువర్ధక, సెరికల్చర్, హార్టికల్చర్, అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, డిజిటల్ అసిస్టెంట్ వంటి పోస్టులు ఉన్నాయి. అదే పట్టణానికి అయితే వార్డు పరిపాలన కార్యదర్శి, శానిటేషన్, ప్లానింగ్, వార్డు ఎడ్యుకేషన్, ఏఎన్ఎం, డిజిటల్, మహిళ పోలీస్, రెవెన్యూ, వెల్ఫేర్, సర్వేయర్ పోస్టులు ఉన్నాయి. ఇవికాకుండా ప్రతి సచివాయలానికి జనాభాను బట్టి 15 నుంచి 20 మంది వరకు వలంటీర్లు ఉన్నారు. కొన్ని పెద్ద పంచాయతీల్లో రెండు నుంచి మూడు సచివాలయాలు ఉన్నాయి. అదే పట్టణంలో వార్డుల సంఖ్యను బట్టి పది నుంచి 20 వరకు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 535 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 133 పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ సచివాలయాల్లో ప్రస్తుతం 4264 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరు కాకుండా నాలుగు వేల మంది వలంటీర్లు ఉన్నారు. గతంలో ఈ సంఖ్య తొమ్మిది వేల వరకు ఉండేది. కొందరు రాజీనామాలు చేయడంతో ఈ సంఖ్య తగ్గింది.

మాతృ సంస్థలకు పంపే యోచన

క్లస్టర్ విధానం అమల్లోకి తీసుకొస్తే నలుగురు నుంచి ఐదుగురు సిబ్బంది మాత్రమే అక్కడ ఉంచి మిగిలిన ఉద్యోగులను వారి మాతృ సంస్థలకు పంపాలని ప్రభుత్వం యోచిస్తోంది. అంటే వ్యవసాయం, పశువర్ధక, హార్టికల్చర్‌కు సంబంధించిన ఆయా శాఖలకు పంపించడం వల్ల ఉద్యోగుల్ని సద్దడంతోపాటు ఆయా శాఖల్లోని ఖాళీలను భర్తీ చేసినట్లు అవుతుంది. సర్వేయర్లను రెవెన్యూ, మునిసిపాల్టీ, హౌసింగ్ డిపార్టుమెంట్లకు, ఇంజనీర్లను ఇరిగేషన్, పంచాయతీరాజ్ వంటి శాఖలకు బదిలీ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. మిగిలిన సిబ్బందిని క్లస్టర్‌లో నియమించి ప్రజలకు మెరుగైన పాలన అందించాలని ప్రభుత్వ ఆలోచన. పట్టణ, మండలాల్లో ప్రతి ఐదు వేల మంది జనాభాకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి అక్కడి సిబ్బందితో ప్రజలకు మంచి పాలన అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే దీనిపై విస్తృత కసరత్తు చేసిన ప్రభుత్వం నేడు కేబినేట్ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకోనుంది.

టీడీపీలోకి ఏలూరు మేయర్

మంత్రి లోకేశ్ సమక్షంలో సొంత గూటికి చేరిన నూర్జహాన్, పెదబాబు

సైకిలెక్కేందుకు కార్పొరేటర్ల ఆసక్తి

వైసీపీకి వరుస షాక్‌లు.. కోలుకోని దెబ్బ

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 27 : ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఆమె భర్త కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకుని సొంత గూటికి చేరారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలో వీరికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితోపాటు ఇడా మాజీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు మంచెం మైబాబు, కార్పొరేటర్ బొద్దాని అఖిల టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏలూరు నగరాభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని వారికి సూచించారు. మేయర్ దంపతులు టీడీపీలోకి చేరడంతో ఆ పార్టీకి మరో షాక్ తగిలినట్లయ్యింది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన ఆళ్ళ నాని వైసీపీకి రాజీనామా చేయడంతో నగరంలో కుదేలైంది. తాజాగా మేయర్, కార్పొరేటర్ల వంతు వచ్చింది. రేపో మాపో మరో 30 మందికిపైగా కార్పొరేటర్లు ఈ పార్టీ తీర్థం తీసుకుంటారు. దీంతో ఈ పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసే నాయకుడు లేకపోయాడు. 50 డివిజన్లు ఉన్న నగరపాలక సంస్థకు 2021లో జరిగిన ఎన్నికల్లో 47 స్థానాలను వైసీపీ, మూడు స్థానాలను టీడీపీ దక్కించుకుంది. ఎన్నికలకు ముందు మరో ఇద్దరు కార్పొరేటర్లు టీడీపీలోకి వచ్చారు. మిగిలిన 45 మందిలో మేయర్ దంపతులు కాకుండా 30 మందికి పైగా టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. మరికొందరు జనసేన వైపు వెళ్లే అవకాశాలున్నాయి.



విలేకరుల సమావేశంలో ఎస్ఎంఆర్ పెదబాబు, మేయర్ నూర్జహాన్, ఎమ్మెల్యే బడేటి చంటి

నగర అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే చంటి

కూటమి ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి మరింత చురుగ్గా తీసుకెళ్ళాలనే లక్ష్యంతో అందరిని కలుపుకుని ముందుకు సాగుతున్నామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతోనే మేయర్ టీమ్‌ను టీడీపీలోకి కలుపుకున్నామన్నారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ 'మొదటిసారి మేయర్‌గా పనిచేసిన ఐదేళ్లలో నగరాన్ని ఎమ్మెల్యే బుజ్జి సహకారంతో ఎంతో అభివృద్ధి చేశాం. రెండోసారి ఎంపికైన అనంతరం వైసీపీ ప్రభుత్వ పాలనలో గత మూడేళ్లలో ప్రజలకు సంతృప్తికరమైన సేవలందించలేకపోయాం. ఏ అభివృద్ధి పని చేయాలన్న నాయకులు ఎన్నో అడ్డంకులు సృష్టించేవారు. ప్రతీ పనికి అప్పటి ఎమ్మెల్యే నాని అడ్డుపడేవారు. మాకు స్వేచ్ఛ లేకపోయింద'న్నారు.

పోయిన నగలు దొరికాయి..



ద్వారకాతిరుమల, ఆగస్టు 27: ద్వారకాతిరుమల పెళ్లికి వచ్చి అక్కడి మండపంలో నగలు పోగొట్టుకున్న వారికి ఆలయ అధికారులు ఆ నగలను తిరిగి అప్పగించారు. ద్వారకా తిరుమల ధర్మఅప్పారావు నిలయంలో ఈనెల 23న పెళ్లి జరిగింది. గుంటూరుకు చెందిన పేరం నాగేశ్వరరావు కుటుంబం తమ బంగారు నగలను గదిలో మర్చిపోయి వెళ్లిపోయారు. వజ్రపు ఉంగరం, గాజు, నల్లపూసల గొలుసు, దుద్దులు కనిపించక పోవడంతో అంతా వెదికి చివరకు దేవస్థానం అధికారుల తెలిపారు. అయితే ఈ నగలను గుర్తించిన అక్కడి సిబ్బంది వాటిని ఆలయ అధికారులకు అప్పగించారు. అధికారులు ఈ విషయాన్ని ఫోన్‌లో యజమానికి తెలియపర్చగా పోయిన వస్తువుల వివరాలు చెప్పారు. ఇక్కడకు వచ్చే వీలు లేకపోవడంతో స్థానికంగా ఉన్న వారి బంధువులకు ఈ నగలను అప్పగించారు.



4వ తేదీ నుంచి అండర్-19 జిల్లా జట్ల ఎంపిక

పెదవేగి, ఆగస్టు 27 : వచ్చేనెల నాల్గవ తేదీ నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి క్రీడాజట్ల ఎంపిక నిర్వహిస్తామని అండర్19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, పెదవేగి గురుకుల విద్యాలయం పీడీ కందికొండ జయరాజు తెలిపారు.అన్ని యాజమాన్యాలకు సంబంధించిన హైస్కూల్, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. వచ్చే డిసెంబరు నెల 31వ తేదీనాటికి 19 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని, ప్రతిభ ఆధారంగా జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని వివరించారు. వచ్చేనెల సెప్టెంబరు 4వ తేదీన పెదవేగి గురుకుల విద్యాలయంలో బాల, బాలికలకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, అథ్లెటిక్స్, సెపక్ తక్రా, కుస్తీ పోటీలు, 6వ తేదీన బాలురకు సంబంధించి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్ బాడ్మింటన్, హేండ్‌బాల్, 10వ తేదీన బాల, బాలికలకు త్రోబాల్, టెన్నీకాయిట్, చెస్, యోగా పోటీలు ఉంటాయన్నారు. 13వ తేదీన బాలికలకు సంబంధించి ఏలూరు సెయింట్ థెరిస్సా కళాశాలలో బాస్కెట్ బాల్, హేండ్‌బాల్, కబడ్డీ, బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 17వ తేదీన బాల, బాలికలకు సంబంధించి ఏలూరు ఇండోర్ స్టేడియంలో బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, జూడో, కరాటే, స్కేటింగ్, 18వ తేదీన ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాల, బాలికలకు ఫుట్‌బాల్, హాకీ, స్విమ్మింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. 19వ తేదీన తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో బాలికలకు సంబంధించి టేబుల్ టెన్నిస్, చెస్, బాడ్మింటన్ వాలీబాల్, ఖోఖో, యోగా పోటీలు ఉంటాయని వివరించారు. 20వ తేదీన ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బాడ్మింటన్ బాలురకు, క్రికెట్ బాల, బాలికలకు నిర్వహిస్తామని తెలిపారు. 21వ తేదీన భీమవరంలోని బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు ఆర్చరీ, షూటింగ్, ఫెన్సింగ్, రోప్ స్కిప్పింగ్, నెట్‌బాల్, జిమ్నాస్టిక్ పోటీలు జరుగుతాయని, అర్హులైన విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో అయా చోట్ల జరిగే పోటీలకు హాజరుకావాలని సూచించారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

క్రీడలతో జాతీయ సమైక్యత : జేసీ

భీమవరం రూరల్ ఆగస్టు 27 : క్రీడలు జాతీయ సమైక్యత భావాలను పెంపొందిస్తాయని ఒలింపిక్స్‌లో కూడా మన క్రీడాకారులు ఎన్నో విజయాలు సాధించడం గొప్ప విశేషమని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. క్రీడాభివృద్ధి శాఖ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని భీమవరంలో మూడు రోజుల పాటు నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవ జ్యోతి, క్రీడా ప్రతిజ్ఞ కార్యక్రమాలను జేసీ ప్రారంభించారు. బాల్యం నుంచి క్రీడల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు విద్యార్థులు ఆసక్తి కలిగించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడల్లో ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి రాజేష్ మాట్లాడుతూ మూడు రోజులపాటు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని, 29న ప్రశంసా పత్రలను అందిస్తామని అన్నారు. డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, జాయింట్ సెక్రటరీ కూనపరాజు రామ కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ మోజీష్, తహసీల్దార్ రవి రాంబాబు, చెరుకువాడ రంగసాయి, కళాశాల పీడీ నరసింహరాజు, పీఈటీలు శేఖర్ రాజు, రామబద్రి రాజు, పీవీ నరసింహరాజు, డా గాదిరాజు రంగరాజు క్రీడా ర్యాలీలో పాల్గొన్నారు.

జడ్పీ బాలెన్స్ షీట్ అందని చందాదారులు హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించండి

ఏలూరుసిటీ, ఆగస్టు 27: జిల్లా పరిషత్ యాజమాన్యం భవిష్యనిధి చందాదారుల 2020-21 నుంచి 2023-24 సంవత్సరం వరకు జమ, ఖర్చు వివరాలు ముసాయిదా బాలెన్స్ షీట్‌లను, 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాల రివైజ్డ్ బాలన్స్ షీట్‌లను సంబంధిత డీడీవో కార్యాలయ ఈ మెయిల్ అడ్రస్‌లకు ఈనెల 16వ తేదీన జారీ చేసినట్టు జడ్పీ సీఈవో సుబ్బారావు తెలిపారు. బాలెన్స్ షీట్లు అందని చందాదారులు ఎవరైనా జడ్పీ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేసినట్టయితే జారీ చేస్తారని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు దర్శిపర్రు విద్యార్థినులు



ఎస్.తేజశ్రీ, గాయిత్రి , హాసిని శ్రీదుర్గ

పెంటపాడు, ఆగస్టు 27 : మండలంలోని దర్శిపర్రు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు వ్యాస రచనలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవోలు శ్రీనివాస్, రామకృష్ణ తెలిపారు. విద్యార్థినులు ఎస్.తేజశ్రీ (10వ తరగతి), పంతం గాయిత్రి (9వ తరగతి), పీ.హాసినిదుర్గ (8వ తరగతి) ఈ నెల 12వ తేదీన మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనపర్చి జిల్లాస్థాయికి చేరుకున్నార న్నారు. మంగళవారం భీమవరం పొట్టి శ్రీరాములు మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపి కయ్యా రన్నారు. విద్యార్థినులను గైడ్ చేసిన టీచర్ వయోలా, హెచ్‌ఎం కేవీ.సత్యనా రాయణ మూర్తిలను సర్పంచ్ కోలా శేషవేణి, ఉపసర్పంచ్ మార్కండేయులు, ఎంఈవోలు అభినందించారు.

స్వదేశానికి చందు మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 27: స్నేహితులతో కలిసి ఖజకిస్తాన్ విహార యాత్రకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందు (49) మృతదేహం మంగళవారం రాత్రి స్వగ్రామానికి వచ్చింది. మూడు రోజుల క్రితం ఖజకిస్తాన్‌లో మృతి చెందిన చందు మృతదేహాన్ని స్వదేశం రప్పించేందుకు మంత్రులు లోకేశ్, నిమ్మల రామానాయుడు ఖజకిస్తాన్‌లోని ఇండియన్ ఎంబసీతో మాట్లాడి స్వదేశం రప్పించేందుకు కృషి చేశారు. చందు అంత్య క్రియలు బుధవారం పెదతాడేపల్లిలో జరగనున్నాయి.



అచంట, ద్వారకాతిరుమల రోడ్లపై కుక్కల గుంపులు

కుక్కలు.. భౌ బోయ్



వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి.. గ్రామాల్లో రోడ్లపై స్వైర విహారం చేస్తున్నాయి.. వాహనాలపై వెళ్లేవారిని తరుముతున్నాయి..దాడి చేసి కరుస్తున్నాయి..కుక్కలు ఉంటున్న వీధి వైపు వెళ్లాలంటేనే జనం భయంతో ఒణికిపోతున్నారు. అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

అచంట ఆగస్టు 27: ఏ గ్రామంలో..ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. రోడ్లపై వెళ్ళే వాహనాలను కూడా అడ్డుకుంటున్నాయి.రాత్రి వేళల్లో నడిచి వెళ్లేవారిపై దాడి చేస్తున్నాయి. కుక్కలను పట్టుకుని అటవీ ప్రాంతాలో వదిలి వేస్తే భయం తగ్గుతుందని పలువురు వాపోతున్నారు.

యలమంచిలి : మండలంలోని గ్రామాల్లో ప్రతి కూడలి వద్ద సుమారు 20కి పైగా కుక్కలు ఉంటున్నాయి. బయటకు అడుగుపెట్టాలంటే భయపడిపోతున్నారు.వారం రోజుల్లో చించినాడ గ్రామంలో 10 మంది, యల మంచిలిలో ఒకరు, మేడపాడులో ఒకరు కుక్కకాటుకు గురయ్యారు. చించి నాడ గ్రామ పంచాయతీ కూడలి సమీపంలో ఒకే రోజు 10 మంది కుక్క కాటు బారినపడ్డారు. వీరిలో కొంతమంది బైక్‌పై వెళుతుండగా కుక్కలు వెంటబడి కరిచాయి.యలమంచిలి తపాలా కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ మేడపాడు గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి కుక్క కాటుకు గురయ్యాడు. పాఠశాలలకు వెళుతున్న దారుల్లో కుక్కలు గుంపులను చూసి విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ వెళుతున్నారు. కుక్కల సమస్యకు పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ద్వారకాతిరుమల : గుంపులు గుంపులుగా శునకాలు తిరుగుతూ క్షేత్రంలో భక్తులను, స్థానికులను బెంబేలిత్తిస్తున్నాయి. వాహదారులపై ఒక్కసారిగా ఉరకడంతో ప్రమాదాలకు గురై క్షతగాత్రులవుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. కొన్ని వీధి కుక్కలకు వైరస్ సోకి ప్రమాద భరితంగా తయారయ్యాయి. వీటిని చూసి క్షేత్రానికి వచ్చిన భక్తులు మరింత భయపడుతున్నారు.

ఆకివీడు : కుక్కలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా జనాన్ని కరుస్తున్నాయి. వీధుల్లో ఒంటరిగా వెళ్ళలేకపోతున్నారు.అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.



యలమంచిలిలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

భీమవరం క్రైం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి. వీధుల్లోనూ, మెయిన్ రోడ్‌లపై ఎక్కడపడితే అక్కడ మీద పడి కరుస్తున్నాయి. ఇటీవల కాలంలో కుక్కలు బెడద పెరిగిపోయింది. రెండేళ్ల క్రితం శ్రీరాంపురం బలుసుమూడి ప్రాంతంలో కుక్కలు సుమారు 20 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అలాగే గతేడాది డిసెంబరులో ఇద్దరు చిన్నారులపై బైపాస్ రోడ్డులో వీధికుక్కలు దాడి చేసి గాయపర్చాయి. పట్టణంలోనే కాకుండా భీమవరం మండలంలోని పలు గ్రామాల్లో కూడా వీధి కుక్కల బెడద పెరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేవారు. కొంత వరకు కుక్కలను అరికట్టేవారు. ఇప్పుడు అలాంటి చర్యలు ఏమీ లేకపోవడంతో కుక్కలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

చాట్రాయి : మండలంలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి రేయింబవళ్ళు స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు వణికిపోతున్నారు. ప్రతి వీధిలోను, వ్యవసాయ భూముల్లో కుక్కలు మందగా సంచరిస్తూ మనుషులు, పశువులు, మేకలు, గొర్రెలపై దాడులకు తెగబడుతున్నాయి. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనదారుల వెంట పడుతుండటంతో వాహనాలు అదుపు తప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. కోళ్ళ ఫారాలు, చికెన్ సెంటర్‌ల నుంచి వచ్చే వ్యర్థాలను గ్రామ శివార్లలో పారబోస్తుండటంతో వాటిని తిని బలిష్టంగా తయారై దాడులకు తెగబడుతున్నాయి.



అయి-భీమవరం రోడ్‌లో బైఠాయించిన ఆక్రమణదారులు

అయి-భీమవరం రోడ్‌లో ఆక్రమణల తొలగింపు

ఆక్రమణదారులతో కలిసి ఆందోళనకు దిగిన సీపీఎం

ఆకివీడు, ఆగస్టు 27 : ప్రజలకు సరఫరా చేసే మంచినీటిలో మురుగు నీరు కలుస్తుండడంతో ప్రజల ప్రాణాలు పోతున్నాయని ఎమ్మెల్యే రఘు రామరాజు అన్నారు. అయి-భీమవరం రోడ్ మార్జిన్ ఆక్రమణదారుల ఇళ్లను అధికారులు, పోలీసుల సమక్షంలో మంగళవారం తొలగింపునకు చర్యలు చేపట్టగా సీపీఎం నేతలు అడ్డుకుని ఆక్రమణదారులతో కలిసి రాస్తారోకో చేశారు. ఆక్రమణదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన వెళ్లలేదని అధికారులు చెబుతున్నారు. స్థానిక వెంకయ్య వయ్యేరు నుంచి దుంపగడప మంచినీటి చెరువుకు వెళ్ల పంటబోదెలోకి మురుగునీరు, వ్యర్థాలు కలుస్తున్నాయని అందుకే ఆక్రమణలు ఖాళీ చేయిస్తున్నట్టు టీడీపీ శ్రేణులు ఆక్రమణదారులకు వివరించారు. సమయం ఇస్తే ఖాళీ చేస్తామని ఆక్రమణదారులు కోరారు. అయినా అధికారులు తొలగింపు చేపట్టడంతో ఆక్రమణదారులతో పాటు సీపీఎం నాయకులు అడ్డుకున్నారు.

వ్యర్థాలతో కలుషితం చేస్తున్నారు : డీపీవో

అయి-భీమవరం రోడ్‌లోని ఆక్రమణదారుల ఇళ్లతో పాటు దుంపగడప పంటబోదెలోకి వ్యర్థాలు వదిలే ప్రాంతాలను మంగళవారం డీపీవో విక్టర్ పరిశీలించారు. స్థానిక వెంకయ్య వయ్యేరు కాలువ నుంచి దుంపగడప మంచి నీటి చెరువుకు వెళ్లే నాలుగు కిలోమీటర్ల పొడవునా ఆక్రమణదారులు, ఆసుపత్రి, బంకులు, హీరోహోండా షోరూమ్, సర్వీసింగ్ సెంటర్, ఆక్వా చెరవులకు సంబంధించిన వ్యర్థాలు పంటబోదెలోకి వదలడంతో పాటు గంగానమ్మ, మూలలంక బోదెలకు సంబంధించిన మురుగునీరు కలుస్తుండడంతో తాగునీరు కలుషితమవుతుందన్నారు.

పెరుగుతున్న గోదావరి

వేలేరుపాడు/పోలవరం ఆగస్టు 27: తెలంగాణ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరికి వరద భారీగా చేరుకుంటున్నది. ఖమ్మం, ఆదిలాబాద్, నిర్మల్ తదితర జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరికి వరద పోటెత్తుతోంది. రెండురోజుల క్రితం వరకు కూడా ఇసుక దిబ్బలతో దర్శనమిచ్చిన గోదావరి నేడు నీళ్ళు కుండలా మారింది. మండలంలోని ఎద్దువాగు, టేకూరువాగు వంతెనల పైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణాలో మరో రెండు, మూడురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. గోదావరి నదికి వరద ఉధృతి పెరిగే అవకాశాలున్నాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందుగానే తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ వస్తున్నది. మంగళవారం సాయంత్రానికి పోలవరం ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో 4,14,380 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు.నీటిమట్టం పెరగడంతో పట్టిసీమ శివక్షేత్రం వద్ద ఇసుక తిన్నెలు నీటమునిగాయి. కొవ్వాడ రిజర్వాయర్ నుంచి విడుదలైన జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి కలుస్తున్నాయి. గోదావరి నీటిమట్టం పెరగడంతో గండిపోశమ్మ ఆలయానికి అధికారులు రాకపోకలను నిలిపివేశారు.



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మానవహారం

దోషులకు సత్వర శిక్ష పడినపుడే అత్యాచారాలకు ఫుల్‌స్టాప్

ఏలూరులో వైద్య విద్యార్థినులు, ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ

ఏలూరు అర్బన్, ఆగస్టు 27 : కోల్‌కతా ఆర్జీకర్ వైద్య కళాశాల పీజీ విద్యార్థి హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల విద్యార్థినులు, 'ఐద్వా' మహిళాసంఘాల ఆధ్వర్యంలో ఏలూరులో భారీ ర్యాలీ, నిరసన ప్రదర్శన నిర్వహించారు. కళాశాల నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్‌వరకు ప్రదర్శన, మానవహారం, చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ప్రదర్శనలు జరిగాయి. దంత వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్లీవరాజు మాట్లాడుతూ రోగుల ప్రాణాలను రక్షించే వైద్యుల భద్రతకు ముప్పు వాటిల్లిందని కోల్‌కతా సంఘటనలు రుజువు చేసాయన్నారు. సినిమాలు, ఇంటర్నెట్ మాధ్యమాల్లో హింస, అశ్లీలతలను అరికట్టాలని కోరారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ దేశంలో మహిళా చట్టాలున్నప్పటికీ వాటిని అమలు చేయడంలో జాప్యం కారణంగానే మహిళలపై దాడులు, అత్యాచారాలు ఎక్కువవుతున్నాయన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, శ్యామలరాణి మాట్లాడుతూ మెడికో వైద్యురాలిపై హత్యోదంతం సభ్యసమాజం తలదించుకునేలా చేసిందన్నారు. కొత్త చట్టాలు ఎన్నో చేస్తున్నప్పటికీ ప్రతీరోజు ఏదోఒకచోట మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ఒక్క ఏలూరు నగరంలోనే గత ఆరునెలల్లో ఆరుగురిపై హత్య, అత్యాచారఘటనలు వెలుగుచూశాయని వివరించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను అన్నిచోట్ల ఏర్పాటుచేసి దోషులకు వెంటనే కఠినశిక్షలు పడేలా చూడాలని నిర్భయ ఉదంతం సందర్భంగా జస్టిస్ వర్మ కమిషన్ చేసిన సిఫారసులను రాష్ట్రప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో దంతవైద్య కళాశాల ఫ్యాకల్టీ డాక్టర్ రాజశేఖర్, మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, పరీక్షల కంట్రోలర్ సిస్టర్ సుశీల, ఐద్వా నాయకులు జయహరీష్, దుర్గ, సీఐటీయు నాయకులు కిషోర్, డీవైఎఫ్ఐ నాయకులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకానగర్‌లో బైక్ దొంగల కలకలం

ద్వారకాతిరుమల, ఆగస్టు 27: మండలంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ ద్వారకానగర్‌లో సోమవారం రాత్రి బైక్ దొంగలు హల్‌చల్ చేశారు. నలుగురు వ్యక్తులు ఓ ఇంటికి వెళ్లి అక్కడున్న బైక్‌ను దొంగిలించబోయారు. అయితే ఆ చప్పుడుకు లేచిన ఇంటి యజమాని సంజు బయటకు వచ్చి కేకలు వేయడంతో ఆ నలుగురు పరుగులు తీశారు. ముగ్గురు పారిపోగా ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. అతడిని పట్టుకుని అక్కడే ఓ స్తంభానికి కట్టివేసిన స్థానికులు భీమడోలు పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఆ ప్రాంతం తమపరిధిలో లేదని వారు వెళ్లిపోయారు. దీంతో ఇంటి యజమాని ద్వారకాతిరుమల పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు దొంగను పట్టుకుని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి వివరాలు సేకరించారు.



ద్వారకాతిరుమల సప్తగోకులంలో హారతులందుకుంటున్న శ్రీకృష్ణుడు. గోసంరక్షణశాలలో గోవులకు భక్తుల పూజలు

నేత్రపర్వంగా..శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 27: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు చినవెంకన్న క్షేత్రంలో మంగళవారం నేత్రపర్వంగా జరిగాయి. అష్టమి మిగులు తిథిని, రోహిణి నక్షత్ర ఆగమనాన్ని పురస్కరించుకున్ని జరిగిన ఈ వేడుకల్లో భాగంగా ఉదయం శేషాచలంపై ఉన్న గోసంరక్షణశాలలో గోవులకు పూజలు చేశారు. సప్తగోకులంలో ఉన్న శ్రీకృష్ణుని దర్శించి పూజించారు. చినవెంకన్న ఆలయంలో శ్రీవారి ఆస్థానంలో కృష్ణుని విగ్రహానికి అర్చకులు, పంచామృత అభిషేకాలు, తిరుమంజన సేవ నిర్వహించారు. 12 సేవాకాలాలు నిర్వహించి 12 రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. బుధవారం సాయంత్రం క్షేత్రంలో ఉట్లోత్సవం జరుగుతుంది.



ప్లకార్డులతో వాణిజ్యపన్నుల ఉద్యోగుల ప్రదర్శన

గత ప్రభుత్వ బలవంతపు బదిలీలను సరిదిద్దండి

ఏలూరు అర్బన్, ఆగస్టు 27 : గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రాంతీయ కార్యాలయాలకు 'ఆర్డర్ టు సర్వ్' పేరుతో బలవంతంగా ఉద్యోగులను బదిలీ చేసిన వారందరినీ వారివారి పూర్వపు కార్యాలయాలకు వెనక్కి పంపించిన తర్వాతే సాధారణ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ వాణిజ్య పన్నుల ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరులోని జేసీటీవో కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శేషకుమార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా 2.0లో రాష్ట్రంలో మూడు ప్రాంతీయ కార్యాలయాలను జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసి, నోడల్ పరిధిలోని జిల్లాల్లో పనిచేయాల్సి వున్న ఉద్యోగులను సుదూర ప్రాంతాలకు 6 నెలల స్వల్పకాల వ్యవధికి విధులు అంటూ వేరే నోడల్ పరిధిలోని జిల్లాలకు ఏకపక్షంగా బదిలీలు చేసిందని, ఆ ఉద్యోగులను ఇంతవరకు వారి సొంత నోడల్ పరిధికి పంపలేదని వివరించారు. చివరకు అంధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులు, వితంతువుల కుండే మినహాయింపులు కూడా ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం ఏకపక్షంగా బదిలీలు చేసిందన్నారు. దీని వల్ల కాకినాడ నోడల్ పరిధిలోని ఉభయ గోదావరి జిల్లాల వాణిజ్య పన్నుల కార్యాలయాల్లో దిగువశ్రేణి మొదలుకుని క్లరికల్ సిబ్బంది, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, తదితర ఉద్యోగులందరూ కుటుంబాలకు దూరంగా ఏళ్ళ తరబడి దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఉద్యోగుల పిల్లల చదువులపై తీవ్రప్రభావం పడుతోందని వివరించారు. తక్షణమే ప్రాంతీయ కార్యాలయాలను రద్దు చేయాలని కోరారు. ఉద్యోగు లందరికీ సమన్యాయం జరిగేలా తమ శాఖలో బదిలీలను వాయిదా వేయాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని ఇప్పటికే కోరామన్నారు.

క్రైం కార్నర్

మూడు రోజుల క్రితం అదృశ్యం.. కాలువలో మృతదేహం

భీమవరం క్రైం, ఆగస్టు 27 : భీమవరం ఉండి రోడ్‌లో ఉన్న కాలువలో మంగళవారం పోలీసులు ఒక మృతదేహాన్ని కనుగొన్నారు. టూటౌన్ ఏఎస్ఐ మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం సత్యవతినగర్‌లో నివాసం ఉండే పాలా సుబ్బారావుకు ఒక కుమార్తె ఉంది. ఆమెకు వివాహమైంది. అయితే ప్రస్తుతం తండ్రి వద్దే ఉంటున్నది. అప్పుడప్పుడు మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోతూ ఉంటుంది. ఈనెల 24వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన కుమార్తె దేవి (33) కనిపించడం లేదంటూ 26వ తేదీన ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం కాలువలో మృతదేహం ఉందంటూ సమాచారం రావడంతో పోలీసులు అక్కడకు వెళ్ళారు. దేవి మృతదేహంగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 27 : ఏలూరు టుటౌన్ రామచంద్రపేటకు చెందిన కడిమి కిశోర్ (37) ఫ్లెక్స్ ప్రింటింగ్ పని చేస్తున్నాడు. భార్య పిల్లలను తీసుకుని మంగళవారం ఓ శుభకార్యానికి వెళ్లింది. అయితే భార్యకు మంగళవారం సాయంత్రం కిశోర్ ఫోన్ చేసి ఇంటికి వచ్చే సమయానికి మంచి గిఫ్ట్ ఇస్తానని చెప్పాడు. వారికి అనుమానం కలిగి పక్క ఇంటివారికి ఫోన్ చేశారు. వారు తలుపులు కొట్టగా ఉరి వేసుకుని కన్పించాడు. దీంతో తలుపులు పగులకొట్టి ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందాడని ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్ట్ పోలీసులకు సమాచారం అందించారు.

తల్లి మందలించిందని వెళ్లిపోయాడు

పాలకోడేరు, ఆగస్టు 27: తల్లి మందలించిందని ఇంటి నుంచి చెప్పా పెట్టకుండా వెళ్లిపోయిన సంఘటన గొరగనమూడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. దీనిపై తండ్రి సతీష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మోహనరావు తెలిపారు. గొరగనమూడి పెదపేటకు చెందిన తులసీ అవినాష్ భీమవరంలోని కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. సోమవారం సెలవుదినం కావ డంతో ఇంటివద్దే ఉన్న అవినాష్‌ను తల్లి మందలించింది. దీంతో అవినాష్ ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంటి నుంచి వెళ్తున్న సమయంలో అవినాష్ ఒంటిపై గ్రీన్ టీషర్ట్, బ్లాక్ నిక్కర్ ధరించి ఉన్నాడు. బంధువులు, స్నేహితుల ఇళ్ళ వద్ద గాలించినప్పటికి ఎటువంటి ఆచూకి లభ్యం కాకపోవడంతో మంగళవారం పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీయత్నం

పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

పెంటపాడు, ఆగస్టు 27: వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసు దొంగిలించేందుకు యత్నించిన ఇద్దరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మండలంలోని వల్లూరుపల్లి గ్రామానికి చెందిన శీలంశెట్టి లక్ష్మీనారాయణమ్మ (55) అలంపురం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్ళింది. తిరిగి తన గ్రామానికి నడిచి వస్తుండంగా రాచర్ల గ్రామం దాటిన తరువాత వెనుక నుంచి మోటర్‌సైకిల్‌పై ఒక మగవ్యక్తి, మహిళ వచ్చి రాచర్ల గ్రామానికి ఎటు వెళ్ళాలని లక్ష్మీనారాయణమ్మను అడిగారు. మీరు రాచర్ల దాటి వచ్చేశారని వెనక్కి వెళ్లాలని బదులిచ్చింది. దీంతో వెనక్కి వెళ్ళిన ఇద్దరూ మరలా ఆమె వద్దకు వచ్చి మామ్మగారు..బండి ఎక్కండి..మిమ్మల్ని మీ ఊర్లో దింపుతామన్నారు. దీనికి లక్ష్మీనారాయణమ్మ వద్దు మా ఊరు వచ్చేసింది..మీరు వెళ్ళండి అని చెప్పింది. అయితే చాలా సేపు ఆమెను బండి ఎక్కమడి ఆ మహిళ సతాయించింది. అనంతరం ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కునేందుకు ప్రయత్నింగా లక్ష్మీనారాయణమ్మ ఒక్కసారిగా పెద్దగా కేకలు వేస్తూ కిందపడిపోయింది. దీంతో బైక్ పై వచ్చిన వారిద్దరూ అక్కడి నుంచి ఉడాయించారు. బైక్‌పై అటుగా వచ్చిన వ్యక్తిని తన గొలుసు లాక్కు వెళ్లిపోతున్నారని పట్టుకోవాలని కోరడంతో ఆ వ్యక్తి వారిని వెంబడించాడు. వల్లూరుపల్లి సెంటర్‌లోకి వెళ్ళిన తరువాత అక్కడ ఉన్న స్థానికులతో విషయం చెప్పడంతో అప్పటికే పుంత రోడ్డు నుంచి పొలాల్లోకి వెళ్ళిపోతున్న ఇద్దరిని స్థానికులు వెంటపడి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పెనుగులాటలో వృద్ధురాలి కొంగుకే బంగారు గొలుసు చిక్కుకుని ఉంది. స్థానికులు చోరీకి యత్నించిన ఇద్దరిని పోలీసులకు అప్పగించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఉమా మహేశ్వరి కేసు నమోదు చేశారు.

బ్లేడ్‌తో చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నం

పెదపాడు, ఆగస్టు 27 : ఇంట్లో గొడవ జరగడంతో బ్లేడుతో చేయి కోసుకుని ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కృష్ణా జిల్లా రామవరప్పాడు ప్రాంతానికి చెందిన మెహన్ అనే యువకుడు పెదపాడు మండలం కలపర్రు వద్ద జాతీయ రహదారిపై రోడ్డు మీద కూర్చొని బ్లేడుతో చేయి కోసుకున్నాడు. సమాచారం అందుకున్న పెదపాడు ఎస్సై శుభశేఖర్ హైవే పోలీసులకు సమాచారం అందించడంతో హెడ్‌కానిస్టేబుల్ కమలాకర్, హోంగార్డు రాంబాబులు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

పెనుగొండలో గంజాయి స్వాధీనం

పెనుగొండ, ఆగస్టు 27 : పెనుగొండలో మూడున్నర కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పెనుగొండ సర్కిల్ ఇనస్పెక్టర్ రజనీ కుమార్, ఎస్ఐ గంగాధర్ తెలిపారు. అటవీ ప్రాంతం నుంచి పెనుగొండ తరలిస్తుండగా పెనుగొండ వ్యవసాయ మార్కెట్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఒడిశాకి చెందిన సానియా హంతల, విశాఖ జిల్లా అచ్యుతాపురం మండలం హరిపాలెం గ్రామానికి చెందిన పాస్టం దుర్గయ్య గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన పాలపర్తి చిన్నిలను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ పెనుగొండ సంత మార్కెట్‌లో ఉంటున్నారు. ఒడిశాకు చెందిన వ్యక్తి వీరికి గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విగతజీవిగా స్వదేశానికి..

మస్కట్ వెళ్లిన కొద్దికాలానికే అనారోగ్యం..

హైదరాబాదు నుంచి బస్సులో వస్తుండగా మృతి



అత్తిలి, ఆగస్టు 27: ఉపాధి కోసం మస్కట్ వెళ్ళిన మహిళ ఆరోగ్య సమస్యలతో తిరిగి స్వదేశానికి వస్తూ మార్గమధ్యంలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అత్తిలి మండలం మంచిలికి చెందిన బొంతా సత్యపద్మ విజయవాడకు చెందిన మహిళా ఏజెంట్ ద్వారా గతేడాది ఆగస్టులో మస్కట్‌కు వెళ్ళింది. అయితే ఆమె ఆరోగ్యం క్షీణించడంతో సమాచారాన్ని తన భర్త ప్రభాకర్‌కు తెలిపింది. దీంతో తన భార్యను స్వదేశానికి పంపాలని ఏజెంట్‌ను కోరడంతో డబ్బులు కడితే కాని పంపించడం జరగదని చెప్పడంతో అప్పు చేసి ఏజెంట్‌కు రూ. 2.10 లక్షలు చెల్లించాడు. అయితే ఏజెంట్ తన భార్యను ఈనెల 30న ఇండియాకు పంపిస్తానని చెప్పి తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఈనెల 24న ఇండియాకు విమానం ఎక్కించి పంపిందన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఆర్టీసీ బస్సులో వస్తుండగా పద్మ గుండెపోటుతో బస్సులోనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రభాకర్ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి పుట్టినిల్లు నిడదవోలు మండలం కోరుమామిడి.

అన్న క్యాంటీన్‌పై తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నాం

» తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, ఆగస్టు 27: తణుకు అన్న క్యాంటీన్‌లో భోజనం ప్లేట్లు ఎంగిలి నీటిలో కడుగుతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు పూర్తిగా అవాస్తమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తీవ్రంగా ఖండించారు. చేతులు శుభ్రం చేసుకునే సింకు బ్లాక్ కావడంతో సిబ్బంది వచ్చి ప్లేట్లు, చెత్త తీస్తున్న సమయంలో వీడియో తీసి వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌రెడ్డి ఆదేశాలతో స్థానిక వైసీపీ సైకో నాయకుడి ప్రమేయంతోనే ప్రస్తుతం అన్న క్యాంటీన్‌పై తప్పుడు ప్రచారానికి పాల్పడి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని, ప్రజలు నమ్మరని అన్నారు.

ప్రభుత్వ భూములను సర్వే చేయాలి : పత్సమట్ల

గణపవరం, ఆగస్టు 27: గ్రామాల్లోని ఇరిగేషన్, డ్రెయినేజీ, ప్రభుత్వ భూములను గుర్తించేందుకు సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో అధ్యక్షుడు దండు వెంకట్రామరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆస్తులను గుర్తించేందుకు అధికారులు సర్వే ప్రారంభించాలన్నారు. గణపవరంలో శిథిలమైన బాలికల హాస్టల్ భవనాన్ని తొలగించి పునఃనిర్మాణం చేసేవరకు ప్రత్యామ్నాయం చూడాలని ఆదేశించారు. తహసీల్దార్ అప్పారావు, ఎంపీడీవో సూర్యనారాయణ, జడ్పీటీసీ సోమలక్ష్మి, ఎంఈవో పి.శేషు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

మంచినీటి ప్రాజెక్టుల్లో ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్లు

మొగల్తూరు, ఆగస్టు 27 : నియోజకవర్గంలోని బృహత్తర మంచినీటి ప్రాజెక్టుల్లో జల జీవన్ మిషన్ ద్వారా ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. మంగళవారం కోమటితిప్పలో మంచినీటి ప్రాజెక్టును ఆయన పరిశీలించి తాగునీటి సరఫరాపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టు పరిధిలో గల అనధికార కుళాయిలు తక్షణమే తొలగించాలని ఆదేశించారు. నాణ్యమైన శుద్ధి జలాలను శివారు గృహాలకు అందించే దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ మోహనరావు, సత్తినేని మోహనరావు, నిప్పులేటి తారక రామారావు, సర్పంచ్ పులపర్తి సూర్యనారాయణ, సరిపల్లి జ్యోతి ప్రసాదరాజు, పడవల సత్యనారాయణ, మేడిద బాబ్జి, ప్రభాకర్, జోగి పండు, మేకల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి ప్రాజెక్టుపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయకర్

ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలి : సీఐ

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 27 : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, హెల్మెట్‌ను ధరించాలని భీమవరం ట్రాఫిక్ సీఐ జి.దాసు విద్యార్థులకు సూచించారు. శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ దాసు, ఎస్ఐ నరసింహరావు మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ నియమాలను వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు, ఎన్ఎస్ఎస్ పోగ్రామ్ ఆఫీసర్ బ్రహ్మం, ఏవో, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

తణుకు, ఆగస్టు 27: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మునిసిపల్ మాజీ కౌన్సిలర్ తాతపూడి మారుతీరావు అన్నారు. మంగళవారం తణుకులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో 1500 వరకు సంఘాలున్నాయంటే మహిళలు కృషి ఎంతైనా ఉందన్నారు. గ్రూపులు చిన్న తరహా పరిశ్రమలు స్థాపించి తణుకులో ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆశయమన్నారు. పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచడానికి సహకరించాలన్నారు. ఆర్పీలు వెంకట లక్ష్మి, రాజేశ్వరి, సంఘ సభ్యులతో పాటు టీడీపీ నాయకులు ఒమ్మి రాంబాబు, గమిని రాము తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కాళ్ళ, ఆగస్టు 27 : మత్తు పదార్థాలు, గంజాయి వంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని ఆకివీడు సీఐ జగదీశ్వరరావు సూచించారు. కాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోలీసు సిబ్బందితో కలిసి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగంతో యువత జీవితాలు దుర్భరమవుతున్నాయన్నారు. సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వాటిపై విద్యార్థినులపై అవగాహన కల్పించారు. కాళ్ళ ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

31న బులియన్ మార్కెట్ సెలవు

నరసాపురం, ఆగస్టు 27 : జైనుల పండుగ నేపథ్యంలో ఈ నెల 31వ తేదీ, వచ్చే నెల ఏడో తేదీలలో నరసాపురం బులియన్ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్టు సంఘం పట్టణ అధ్యక్షులు వినోద్‌కుమార్‌జైన్ చెప్పారు. బంగారం, తాకట్టు దుకాణాలను ఆ రెండు రోజులు మూసివేస్తామని తెలిపారు.

ఆరవల్లిలో మిషన్ శక్తిపై అవగాహన

అత్తిలి, ఆగస్టు 27: ఆపద నుంచి బయట పడేలా మహిళల్లో చైతన్యం కల్పిస్తున్నామని మంచిలి సెక్టార్ పర్యవేక్షకురాలు పి.మహాలక్ష్మి తెలిపారు. ఆరవల్లిలో మంగళవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి పాల్గొన్నారు.

అధిక విద్యుత్ బిల్లులు రాకుండా చూడాలి : వర్మ

ఆకివీడు, ఆగస్టు 27 : ఇళ్లకు విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నందున వినియోగదారుల జేబులు చిల్లులు పడుతున్నాయని పౌరుల సంక్షేమ సంఘం పట్టణ కన్వీనర్ బొక్కా వర్మ అన్నారు. మంగళవారం బాధితులతో కలిసి స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ఏఈ ప్రదీప్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

200 మందికి నోట్ పుస్తకాల పంపిణీ

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 27 : స్థానిక అద్దేపల్లి వారి సత్రం సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ఎలిమెంట్రీ పాఠశాల విద్యార్థులు 200 మందికి నోట్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి హెచ్ఎం భవానీ ప్రసాద్ అధ్యక్షత వహించి సత్రం ద్వారా చేస్తున్న విద్యాసేవలను అభినందించారు. సత్రం ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, ఛైర్మన్ అద్దేపల్లి మోహన్‌దాసు, సిబ్బంది ఆచారి రామకృష్ణ, ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్, మంతెన సాయిబాబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

సహకార సంఘాలు కంప్యూటరీకరణ చేస్తున్నాం

మొగల్తూరు, ఆగస్టు 27:ప్రాథమిక సహకార పరపతి సంఘాలను కంప్యూటరీకరణ చేస్తున్నట్టు డీసీసీబీ ఏజీఎం పి.చంద్రశేఖర్ తెలిపారు. మొగల్తూరు ప్రాథమిక సహకార సంఘంలో కంప్యూటరీకరణ చేస్తున్న విధానాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల తరహాలోనే గ్రామీణ ప్రాంతాల్లోని సొసైటీలను కంప్యూటరీకరణ చేస్తున్నామన్నారు. అక్టోబరు రెండో తేదీకి కంప్యూటరీకరణ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. సొసైటీ కార్యదర్శి కొత్తపల్లి గోవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నేత హనుమంతరావు మృతి

పెనుమంత్ర, ఆగస్టు 27 : బీజేపీ సీనియర్ నేత గంటా హనుమంతరావు(72) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పెనుమంత్ర మండల బీజేపీ అధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా పాలకవర్గ సభ్యుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సేవలు అందించారు. ఆయన మృతి పట్ల బీజేపీ మండల శాఖ ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆచంట నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కేహెచ్‌వీ ప్రసాద్‌రెడ్డి, వీఎస్ వర్మ, అల్లూరి సాయిదుర్గరాజు, కొండలరావు, సుందరరావు సంతాపం తెలిపారు.



హనుమంతరావు(ఫైల్)

గోతులను పూడ్చిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుమంత్ర, ఆగస్టు 27 : 'గోతులు పూడ్చండి మహాప్రభో' అంటూ మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. పాలమూరు హాస్టల్ నుంచి నవుడూరు సమీపం వరకు ఇటీవల కొత్తగా రోడ్డు నిర్మించారు. మధ్యలో కొంత భాగం రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. ఆ ప్రాంతంలో కురిసిన వర్షంనీరు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపైకి నీరు వచ్చి చేరి చెరువులా మారుతోంది. దీనిపై ప్రచురితమైన వార్తకు స్పందించిన ఆర్అండ్‌బీ ఏఈ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరును మళ్లించి.. గోతుల్లో కంకర వేసి పూడ్చారు. ఈ మేరకు వాహనదారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



గోతులను పూడ్చిన ఆర్ అండ్‌బీ అధికారులు

టీడీపీ యాప్ టాపర్లకు అభినందనలు

ఉండి, ఆగస్టు 27: టీడీపీ యాప్ ద్వారా పార్టీ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి టాపర్లుగా నిలిచిన వారంతా మరింత విధిగా పనిచేసి పార్టీ అధిష్టానం మన్ననలు అందుకోవాలని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ఆకాంక్షించారు. మంగళవారం ఉండి పార్టీ కార్యాలయంలో వారికి ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌బాబు పంపించిన ప్రశంసాపత్రాలను వారికి అందించి అభినందించారు. కలిగొట్ల గ్రామానికి చెందిన ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి యశోధకృష్ణయ్య, డాక్టర్ పొత్తూరి ప్రసాదరాజు, పాలకోడేరు మండలానికి చెందిన పార్టీ నాయకులు నందం సత్యనారాయణ, సన్నిధి నరేష్‌కుమార్ ఉన్నారు. వీరిని ఎమ్మెల్యే కార్యాలయం పర్సనల్ ఇన్‌చార్జి కొత్తపల్లి నాగరాజు, మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, కలిగొట్ల ఎంపీటీసీ రుద్రరాజు యువరాజు, సర్పంచ్ ఎంఎస్, తదితరులు అభినందించారు.



టాపర్లను అభినందించిన ఎమ్మెల్యే రఘురామ

సంఘ సేవకులకు సత్కారం..

సంఘసేవకుడు చెరుకువాడ రంగసాయి, విశ్రాంతి ఉపాధ్యాయుడు రంగరాజులను ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు మంగళవారం సత్కరించారు. చెరుకువాడకు చెందిన రిటైర్డ్ టీచర్ రంగరాజు సమాజ సేవ చేస్తూ నాటకం మీద పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నారు. భీమవరానికి చెందిన శ్రీరంగసాయి మంచి సంఘ సేవకుడంటూ కితాబు ఇచ్చారు.

సర్పంచ్‌ల చాంబర్ కూటమి అధ్యక్షుడిగా 'ముచ్చర్ల'

గణపవరం, ఆగస్టు 27: గణపవరం మండల సర్పంచ్‌ల చాంబర్ కూటమి అధ్యక్షుడిగా ముచ్చర్ల వేణుగోపాల మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండలం సర్పంచ్‌ల ఛాంబర్ సమావేశానికి సర్పంచ్ చనుమూరి లక్ష్మీభవాని అధ్యక్షత వహించారు. కూటమి నూతన కమిటీ చాంబర్ ఉపాధ్యక్షుడిగా మల్లంపల్లి సురేష్, కోశాధికారిగా చుక్కా అప్పారావు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను ఎంపీపీ దండు వెంకట్రామరాజు పూలమాలలు వేసి సత్కరించారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి : ఏఈ

కాళ్ళ, ఆగస్టు 27 : ప్రభుత్వం కేటాయించిన లే-అవుట్లలో లబ్ధిదారుల గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ పి.ఆంజనేయరాజు సూచించారు. కాళ్ళ సచివాలయంలో గృహనిర్మాణ లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 198 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వీటన్నింటిని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. వచ్చే ఏడాది మార్చికి కేంద్ర ప్రభుత్వం స్కీమ్‌ను పూర్తి చేసే అవకాశం ఉందని సూచించారు. లేఅవుట్లలో ఇళ్లు మంజూరైన వారు వెంటనే పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో స్థలాలు వెనక్కి తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. సర్పంచ్ బందా విజయ, ఉపసర్పంచ్ పన్నాసి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బి.సతీష్, వర్క్ ఇన్స్పెక్టర్ విల్సన్, పుప్పాల బుజ్జి, బందారు సోమేశ్వరరావు, మోగళ్ళ షావుకారు, హౌసింగ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మానవత' బస్‌పాస్‌ల వితరణ

తణుకు, ఆగస్టు 27:మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో తణుకు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు అందజేశారు. మంగళవారం మానవత శాంతి ర్యాలీ జిల్లా ఛైర్మన్ గమిని రాంబాబు ఆధ్వర్యంలో 200 మందికి పాస్‌లు అందజేశారు. ఆర్టీసీ డీఎం గిరిధర్, మానవత నాయకులు బోయపాటి రామలక్ష్మి, ఎస్వీ సతీష్‌బాబు, రామకాశీ, అక్కిన కాశీ, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, ఆగస్టు 27: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందులు షాపు ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు మంగళవారం సంఘ కార్యాల యంలో డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నిర్వహించారు. 27 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి సూచనలిచ్చారు. సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, కోసూరి గాంధీ, ద్వారంపూడి బాపిరెడ్డి, ఇవటూరి లక్ష్మణరావు, అలివేలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి వినియోగంపై అవగాహన ర్యాలీ

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 27 : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నీటి వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ సకల జీవరాసులు, వనాలకు జలం ఆధారం అని అందువల్ల ప్రతీ నీటిబొట్టును సద్వినియోగం చేయాలని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ అధ్యాపకులు పార్థసారథి, కె.భద్రాచలం, తదితరులు ఉన్నారు.



అవగాహన ర్యాలీలో అధ్యాపకులు, విద్యార్థులు

క్రైం వార్తలు

దాడి చేసిన వ్యక్తిపై కేసు

కాళ్ళ, ఆగస్టు 27 : ఓ వ్యక్తిని కొట్టి గాయపరిచిన ఘటనపై కాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. కాళ్ళ ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. దొడ్డనపూడికి చెందిన పి.శ్రీనివాసరావు అలియాస్ ఏసుబాబు కాళ్ళ గ్రామంలోని కొత్తకాలనీ వద్ద బడ్డీ కొట్టులో సిగరెట్ కొంటుండగా బొట్టా పవన్ అనే వ్యక్తి పాత గొడవలను పురస్కరించుకుని కులం పేరుతో దూషించి దాడి చేశాడు. గాయాల పాలైన ఏసుబాబును తన సోదరుడు 108లో భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కొట్లాటపై పరస్పరం కేసుల నమోదు

పాలకోడేరు, ఆగస్టు 27: ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగి బుద్దాన జగన్మోహనరావు ఫైనాన్స్ నగదు కట్టాలని అడిగి నందుకు కొట్టి గాయపరిచిన విస్సాకోడేరు శివారు వంకాయలపాలెంకు చెందిన కురసా వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశామని పాలకోడేరు పోలీసులు మంగళవారం తెలిపారు. ఇదే కేసులో ఇంటికెళ్ళి చేతులతో కొట్టి గెంటినందుకు కురసా వెంకటేశ్వరరావు తల్లి లక్ష్మీదుర్గ ఫిర్యాదు మేరకు ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగి బుద్దాన జగన్మోహన్‌రావుపై కేసు నమోదు చేశామని పాలకోడేరు పోలీసులు తెలిపారు.

మద్యం తాగొచ్చి హింసిస్తున్న భర్తపై..

భీమవరం క్రైం, ఆగస్టు 27 : తన భర్త నిత్యం మద్యం తాగొచ్చి మానసికంగా శారీరకంగా హింసిస్తున్నాడని భీమవరం పట్టణం ఎల్అండ్‌టీ కాలనీకి చెందిన వేమగిరి అచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వన్‌టౌన్ పరిధిలో ఉంటున్న వేమగిరి రాంబాబుతో పద్దెనిమిదేళ్ల క్రితం అచ్చమ్మతో వివాహమైంది. ప్రతి రోజు మద్యం తాగొచ్చి శారీరకంగా ఇబ్బంది పెడుతున్నాడని మంగళవారం కూడా యథావిధిగా మద్యం తాగి వచ్చి కొట్టిన అనంతరం చాకుతో పొడవబోతుండగా ఆమె చెయ్యి అడ్డుపెట్టడంతో తీవ్రం గాయపడింది. బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్లినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

దండగర్ర విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 27: దండగర్ర జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు కేంద్ర విద్యాశాఖ ప్రశంసా పత్రాలు పంపినట్టు హెచ్ఎం చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా కేంద్ర విద్యాశాఖ, ఎన్సీఈఆర్టీ దేశవ్యాప్తంగా నిర్వహించిన క్విజ్, చిత్రలేఖనం పోటీల్లో కె. నాగగంగాయామిని, అర్జున, మానస, కప్పల మేఘన, షైనం నాగలక్ష్మి, బాలిన శ్యామ్, ఆర్వీవీ రాఘవ, జి.సాయిమహిధర్, కె.హేమంత్, ఈ.లోకేష్ ప్రతిభ కనబరచి ప్రసంసా పత్రాలు అందుకున్నారన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

భీమవరంటౌన్, ఆగస్టు 27 : తెలుగు భాషను ఆదరించడం.. తెలుగు తల్లి రుణం తీర్చు కోవడమేనని.. తెలుగు భాషను పరిరక్షించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జీటీపీ మహిళ కళాశాలలో తెలుగు భాష ఔన్నత్యంపై సదస్సు, తెలుగు పండితులకు సత్కారం, విద్యార్థులకు పోటీల కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఈడీ మహిళ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపురెడ్డి ధనలక్ష్మి మాట్లాడుతూ తెలుగు భాష అమృతమైన భాష అన్నారు. తెలుగు అధ్యాపకులు ఎస్.నాగేశ్వరరావు, కేజీఆర్ఎల్ కళాశాల తెలుగు శాఖ అధిపతి నాచు శ్రీవల్లి, రిటైర్డు టీచర్ ప్రయాగ మాణిక్యాలరావు, కె.గోపాలశర్మ మాట్లాడుతూ తెలుగు భాషలో కథలు, సామెతలు ఏనాటికి చెరగని ముద్రలన్నారు. అనంతరం చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి నలుగురు పండితులను సత్కరించారు. గాదిరాజు రంగరాజు, జి.సతీష్ పాల్గొన్నారు.

రేపు 2కె రన్ పోటీలు

తణుకు, ఆగస్టు 27: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాలలో ఉదయం ఏడు గంటలకు 2కె రన్ నిర్వహిస్తున్నట్టు సంఘ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. పోటీలు అండర్-12, 14, 17, 20 బాలబాలికలు, స్త్రీ, పురుషుల విభాగాల్లో నిర్వహించి విజేతలకు బహుమతులి స్తామన్నారు. వివరాలకు 99893 63978, 82472 60545 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు ఆపాలి

భీమవరం టౌన్/పాలకొల్లు అర్బన్, ఆగస్టు 27 : వాణిజ్యపన్నుల శాఖలో ప్రస్తుతం జరుగుతున్న బదిలీలను ఆపాలని, సీఆర్‌యూలను రద్దు చేసి సర్కిల్ వ్యవస్థను బలోపేతం చేయాలని వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్ సూర్యనారాయణ పిలుపు మేరకు మంగళవారం భీమవరంలోని వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయం వద్ద, పాలకొల్లులోని హనుమాన్ కాలనీలోని అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం భోజన విరామం సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకంగా గతంలో జరిగిన బదిలీలను పునఃసమీక్షించాలని డిమాండ్‌చేసారు. భీమవరంలో నాయకులు వి.రాజేష్‌కుమార్, టి.రాజశేఖర్, ఎస్. సుధాకర్, విశైలజ, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు. పాలకొల్లులో ఏలూరు డివిజన్ జాయింట్ సెక్రటరీ పి.వీరభద్రరావు, ఏపీజీఈఏ పాలకొల్లు తాలూకా అసోసియేట్ అధ్యక్షుడు టీవీ రామ్మూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాలకొల్లులో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

గృహ నిర్మాణ బకాయిలు చెల్లించాలని ధర్నా

తణుకు, ఆగస్టు 27: దువ్వలో గతంలో నిర్మించుకున్న ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు బకాయిలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఆర్ఐ భవానీకి వినతి పత్రం ఇచ్చారు. సంఘ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

బైరాగి మఠంలో ఘనంగా నందోత్సవం

పెంటపాడు, ఆగస్టు 27: కే.పెంటపాడు బైరాగిమఠం గోపాలస్వామి, ఆంజనేయ స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆలయ ఫిట్ పర్సన్ రవిశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నందోత్సవం (ఉట్టి కొట్టుడు) నిర్వహించారు. విద్యార్థులు ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.



ఉట్టి కొడుతున్న విద్యార్థులు

వెంకన్న ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

కాళ్ళ, ఆగస్టు 27 : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైష్ణవ శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం సంప్రోక్షణ అనంతరం దేవాలయం తెరిచి భక్తుకు స్వామివారి దర్శనం కల్పించారు. 12 రకాల ప్రసాదాలతో నివేదన సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈవో ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాయి గాయత్రి ఆలయంలో విగ్రహాలకు పూజలు

పాలకొల్లు అర్బన్ : స్థానిక చిత్రాయి చెరువుగట్టు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన సాయి గాయత్రీ ఆలయ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు దేవతామూర్తులను పంచాది వాసాలతో పూజలు చేశారు. విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి నాగులకొండ గోపి సత్యనారాయణ, శాంతిరత్న దంపతులు ఆలయాన్ని నిర్మించారు. శ్రీమాన్ పెద్దింటి అనిల్ కుమారాచార్యులు ఆధ్వర్యంలో గాయత్రి దేవి, విశ్వకర్మ, పరమేశ్వర గణపతి, తదితర విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమాల్లో విగ్రహాల దాతలు నాగులకొండ రాజేష్‌కిరణ్ జ్ఞాపకార్థం తల్లిదండ్రులు గోపి సత్యనారాయణ, శాంతిరత్న, కుమారుడు యజుర్ సాయి, ఎస్. వసుధాదేవి, కట్టోజు సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం

పెనుగొండ : సిద్ధాంతంలో పురాతనమైన విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. అర్చకులు వెలవలపల్లి జానకీరామయ్య శర్మ మాట్లాడుతూ బుధవారం ఉదయం వెండి ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ నిర్వహిస్తామన్నారు. అనంతరం విఘ్నేశ్వరస్వామికి లక్ష గరిక పూజా జరుగుతుందన్నారు.

కాంబోట్లపాలెంలో మంగళగౌరి వ్రతం

యలమంచిలి :విశ్వ హిందూ పరిషత్తు ఆధ్వర్యంలో కాంబోట్లపాలెం శ్రీ కనక దుర్గమ్మ ఆలయంలో సామూహిక మంగళగౌరి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధల తో నిర్వహించారు. టి.సునీతదేవి, వీహెచ్‌పీ మండల కార్యదర్శి దివి ప్రకాష్, అనిశెట్టి సురేష్, బండి సూర్యనారాయణ, బెజవాడ రాజా తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీకృష్ణునికి 108 రకాల నైవేద్యాలు

భీమవరంటౌన్ : శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మెంటేవారి తోటలోని చినమిల్లి ఆదినారాయణ, లక్ష్మీ నివాసంలో శ్రీకృష్ణునికి 108 రకాల పిండి వంటలతో నైవేద్యం పెట్టారు. సుమారు 100 శ్రీకృష్ణుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి చిన్ని కృష్ణుడికి ఉయ్యాల సేవ చేశారు.



సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు : కమిషనర్

భీమవరంటౌన్, ఆగస్టు 27 :వార్డుల్లో సమస్యల పరిష్కారం విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి హెచ్చరించారు. మంగళవారం 33వ వార్డులో పారిశుధ్యపనులను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. గుర్తించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పనుల విషయంలో అలసత్వం వద్దన్నారు. అవసరమైన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో ఉద్యాన సాగులో పురోగతి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 27: ఉద్యాన సాగులో సాంకేతికత జోడించడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో దేశం ముందుకు వెళ్తుందని ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ సూచించారు. వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ పరిధిలోని కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధనా విద్యార్థులకు 'సాంకేతి పరిజ్ఞానం ద్వారా ఉద్యాన సాగులో సుస్థిరత' అనే అంశంపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు మెలకువలు తెలుసుకుని సాగులో ఉన్నత ఫలితాలు సాధించవచ్చన్నారు. పీజీ డీన్ డాక్టర్ ఎస్. సూర్యకుమారి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

నేడు మాధవాయిపాలెం రేవు పాట

నరసాపురం రూరల్, ఆగస్టు 27: మాధవాయిపాలెం రేవు పాటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు బహిరంగ, సీక్రెట్ పద్ధతిలో పాట జరుగుతుంది. పాట ప్రారంభ ధర రూ 2.97 కోట్లుగా నిర్ణయించారు. మండల పరిషత్‌లో జరిగే పాటకు అధికారులు పాటదారులతో పాటు ఒకర్ని మాత్రమే లోనికి అనుమతిస్తారు. ఇతర వ్యక్తుల్ని అనుమతించరు.

అక్రమ తూరలు మూసివేత

ఆకివీడు రూరల్, ఆగస్టు 27 :దుంపగడప మంచినీటి చెరువుకు నీరందించే పంట కాల్వలోకి అక్రమంగా పెట్టిన మురుగునీటి తూరలను మంగళవారం అధికారులు పూడ్చివేశారు. కాలువ వెంబడి పర్యటించి గ్రామ పరిధిలోని వాటిని ఎక్స్‌కవేటర్ సాయంతో పూడ్చివేశారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు అందజేస్తున్నట్టు అధికారులు తెలిపారు. వాటిని పూర్తిగా తొలగించకపోతే కఠిన చర్యలు తప్పవని ఆ ప్రాంతాలను డీపీవో, డీఎల్‌పీవో పరిశీలించి హెచ్చరించారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలు పాల్గొనాలి

నరసాపురం రూరల్, ఆగస్టు 27: బీజేపీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలంతా ఉత్సాహంగా పాల్గొవాలని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్ పిలుపునిచ్చారు. మంగళవారం చిట్టవరంలో సభ్యత్వ నమోదుపై జరిగిన పార్టీ విస్తృత సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. వచ్చే నెల రెండో తేదీ నుంచి జరిగే సభ్యత్వ నమోదులో ప్రతి వార్డు, గ్రామం నుంచి సభ్యత్వాలు ఉండాలని, గతం కంటే ఎక్కువ సంఖ్యలో నమోదు చేయాలన్నారు. పీవీఆర్, పండు, దిలీప్, రాము, వెంకటేశ్వర్లు, విజయకృష్ణ, సంజీవరావు, సూర్యనారాయణ, శ్రీను, సాయి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి రక్త పరీక్షలు

భీమవరం క్రైం, ఆగస్టు 27 : పోలీసు విధి నిర్వహణలో తమ సిబ్బంది ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారని ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలనే ఉద్దేశంతో సిబ్బందికి రక్తపరీక్షలు నిర్వహిస్తున్నామని టూటౌన్ సీఐ కాళీ చరణ్ అన్నారు. భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సిబ్బందికి ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపరీక్షల నివేదికల ఆధారంగా వైద్యులను సంప్రదించి ఎస్పీ ఆదేశాలతో వైద్య సాయం అందిస్తామని పేర్కొన్నారు.



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మాదిగ అమర వీరుల చిత్రపటాలకు పాలాభిషేకం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 27 : వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమర వీరుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చిన్నిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు పాటూరి సువర్ణరాజు, పట్టణ అధ్యక్షుడు పసల బోసు ఆధ్వర్యంలో అమర వీరుల చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ మాదిగల ఆశాజ్యోతిగా నిలిచిన మందకృష్ణ మాదిగను మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నాయకులు వైరత్నరాజు, పి.ఫైడియ్య, పుసుపులేటి రాజేష్‌ఖన్నా, శెట్టం ఝాన్సీ, వరదరాజులు, రేణిబాబు, శరత్, బాలం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నరసాపురం టౌన్, ఆగస్టు 27: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీహరిపేటలో నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం పలువురికి మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాద్, డాక్టర్ మోహన్, డాక్టర్ సత్యభూషన్, దొండపాటి స్వామి, సత్తిబాబు పాల్గొన్నారు.

థెరిసా సేవలు అనుసరణీయం : సీఐ

పాలకొల్లు రూరల్, ఆగస్టు 27 : సంఘ సేవకురాలు మదర్ థెరిసా సేవలు అనుసరణీయమని పాలకొల్లు రూరల్ సీఐ గుత్తుల శ్రీనివాస్ అన్నారు. పెదమామిడిపల్లిలో మంగళవారం థెరిసా జయంతి కార్యక్రమాన్ని చిరు, మదర్ సేవా సమితి అధ్యక్షుడు చేబ్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా 150మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తులా రామలింగేశ్వరరావు, కోపల్లి శ్రీనివాస్, శిడగం సురేంద్ర, బీఎల్ నారాయణ, కె.సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.